# "రచ. ఇ. త"

అతని అసలు పేరు ఇంబఖార్ తమ్మయ్య. అతను ఎప్పటికప్పుడు కథలు రాయగలడు; ఇప్పటికిప్పుడు రాయగలడు. అందుచేత అతని స్నేహితులు అతణ్ని "ఇప్పటికిప్పటి కథకుడు" అని పిలుస్తూండేవారు. అలా పిలవగా పిలవగా ఆఖరికతను ఇప్పటి తమ్మయ్యగా మిగిలిపోయేడు. ఆ పేరున తను టూకీగా "ఇ.త"గా మారిస్తే, దాన్ని కొంతమంది స్నేహితులు "ఇత్తగాడు"కింద మార్చేరు అయితే, "ఇ.త"గా అతను ఆంధ్ర పాఠకలోకానికి సుపరిచితుడు; అందులో చాలామందికి అతను అతి ప్రియుడు, చదువుకున్నవారు పదిమంది చేరిన చోటుకి ఓ రాయివిసిరితే అది ఇ.త గారి ఇష్టుల్లో ఒక్కడికైనా తగిలి తీరుతుంది. పదిరాళ్ళు విసిరితే పదిమందికైనా తగలవచ్చు. నిజం చెప్పాలంటే అతనికి, ఇంట్లో కూర్చొని వీధిలోకి రాళ్ళు రువ్వినట్టు, పాఠకులమీదికి కథలు విసరడం అంటే చాలా సరదా, ఫలానావాళ్ళకి తగలాలి అని అతను గురిచూసి కొడుతూంటాడు కూడాను. ఇంకా నిజం చెప్పాలంటే అతనికి రాళ్ళు రువ్వడంతోనే కథలు రాయడంకూడా ఎక్కువ అలవాటయింది.

ఇ. త. కి పదిహేనోయేడు వెళ్ళి పదహారో ఏడు వచ్చినప్పుడు వాళ్ళ పక్కింటి అమ్మాయికి పద్మాలుగోయేడు వెళ్ళి పదిహేనోయేడు వచ్చింది. ఇ. త. అప్పటికప్పుడే మనోరమ, మనోహరి, మైదానం.

మగువ తెగువ వగైరా పుస్తకాలు కంఠస్థంచేసి ఉన్నాడేమో నక్కికి నడి వయసు వచ్చినట్టు మాంచి పెంకితనంగా ఉండేవాడు. అతని పక్కింటి అమ్మాయి ఆ పుస్తకాలేమీ చదవలేదు; కాని వంటరిగా డాబా మీద పడుకొని చంద్రున్ని, చుక్కల్నీ చూడాలనే ఆకాంక్ష ఆమెలో ఉత్పన్నమయింది. ఆ పిల్ల అలా డాబామీద వంటరిగా ఉండే సమయాల్లోనే ఇ. త.కి కూడా డాబామీద ఎక్కాలనే అభిలాష కలిగేది. కాని, సాయంకాలాలవేళ మైదానంమీదకి ఆటలకి పోకుండా డాబాలమీద బీటుకి నిల్చునే కుర్రవాళ్ళని పక్కింటి పెద్దలు ఓ కంట కనిపెడుతూ వుంటారని ఇ. త. కనుక్కోలేకపోయాడు. ఓనాటి సాయంకాలపు టారుగంటల శీతాకాలపు మసకవెన్నెల్లో పక్కింటి డాబామీద పడుకున్న ఆడపిల్ల మీదికి "ఇ.త." ఒక రాయి (చాలా చిన్నది, ఎంతో ముద్దుది, "ప్రేమరాయి" అనే పేరుగలది ఓ రాయి.) విసిరాడు. రాయి విసిరేక అతను అక్కడ పడుకున్నది. ఆడపిల్ల కాదనీ "ఆడపులి" పేరుగల ఆమె మేనత్త అనీ తెలుసుకున్నాడు. ఆ మేనత్త వెంటనే అరుపులుఅరిచి తన తమ్ముణ్ని ఇ.త.మీదికి ఉసిగొల్పింది. తమ్ముడంటేచిన్న బుల్లి తమ్ముడుకాదు. ముప్ఫయ్యేళ్ళవాడే అయినప్పటికీ ముప్ఫైరెండేళ్ళ అక్కకి అతను తమ్ముడే. అతను వచ్చి ఇ. త.ది ఇంతే వున్నపిలక పట్టుకొని వీపు చీరేశాడు. దాన్తో పెద్ద అల్లరయిపోయింది. ఇ. త.తల్లి (ఇ.త.కి తండ్రిలేడు, అందుచేత తల్లేవెళ్ళి పక్కింటివాళ్ళ కాళ్ళు పట్టుకొని, వాళ్ళ కోపం తగ్గించడానికి వాళ్ళ కళ్ళముందే తనుకూడా ఇ.త.ని పట్టుకొని ఓ ఉతుకు ఉతికేసింది. ఆ తగువు అంతటితో చల్లారింది. కాని, ఇ.త.గారి మనసులో క్రోధం చల్లారలేదు. చేతనైన వాడి కోపం చేతల్లో వుంటుంది. మరి కొందరి కోపం రాతల్లో ఉంటుంది.

అంతకుముందు అతను చాలా కథలు రాసేడు. కాని అవి పబ్లిష్ కాలేదు. కాని ఈ కథమాత్రం అతను చాలా జాగ్రత్తగా రాసేడు. చల్లారని వీపు మంటతో చాలా పట్టుదలగా రాశాడు.

ఆ కథలో—

ఒక నవయువకుడు పదహారేళ్ళ వాడుంటాడు అతను గాఢంగా ఓ యువతిని ప్రేమిస్తాడు. ఆమెకూడా ఆ విధంగానే చేస్తుంది. కాని, "స్వర్గంలో సర్పం, గులాబికి ముళ్ళు. మణికి ఫణి ఉన్నట్టుగా ఆమెకు ఒక మేనత్త ఉంటుంది, ఆమె బాల విధవ, ఇల్లు బట్టిన విధవాడబడుచూను. ఆమె వీరి ప్రేమకు అడ్డు తగుల్తూంటుంది. ఓనాడు ప్రేమ యువతి కాబోలు తన డాబామీద పడుకొని ఉండగా ఆ ప్రేమ యువకుడు సాంకేతికంగా చిన్న రాయి విసురుతాడు. ఆమె సాంకేతికంగా కుడిచెయ్యి ఎత్తి దించుతుంది. అప్పుడు యువకుడు తన డాబామీదనుంచి ఆమె డాబామీదికి లంఘించి ఆమెని చేరేసరికి ఆమె యువతికాదు; విధవాడబడుచు! ప్రేమ యువకుడు ఆశ్చర్యపోయాడు, కాని, ఆవిడ ఆశ్చర్యకరంగా. మౌనంగా, దీనాతిదీనంగా అతని చేయిపట్టుకుని ఏదో అర్థించే సమయానికి ఆవిడ తమ్ముడు వస్తాడు. అతను ప్రళయరుద్రుడవుతాడు. విధవాడబడుచు బిక్కు బిక్కు చూపులు చూస్తుంది. పులికి దొరికిపోయిన హరిణంలా ఉంటుందావిడ. ఆ చూపు చూడగానే ప్రేమయువకుళ్ళో జాలి కెరటాలు లేస్తాయి. ఆ విధవరాలిలోని తీరని కోరికల బాధనతడు అర్థం చేసుకుంటాడు. తన భావాల్ని అర్థం చేసుకోకుండా తన మేనగోడలి యవ్వనాన్ని కామించినందుకు ఆవిడలోని ఉండే అనురాగం ఆ యువకుని ఎడల కోపంగా మారిందేకాని మరోకలా కాదని అతను గ్రహిస్తాడు. ఆమె నిజభావం క్షణంలో అతనికి అర్థమవుతుంది. పునర్వివాహమేకాని ఆవిడ చేసుకోగలిగినట్లయితే, ఈ సంఘం ఆవిణ్ని చేసుకోనిచ్చినట్లయితే ఆవిడకి ఆ దురవస్థ తప్పేదికదా అని అతను లోలోన వాపోతాడు. ఆవిడ పరువు కాపాడ్డానికి తను ఏ త్యాగమైనా చేయాలనుకుంటాడు. ఆవిడ చాలా అందంగా ఉంటుంది. ఆవిడకి తల ఉంటుంది. చేతులకి బంగారపువి జత గాజు లుంటాయి. అప్పుడు ఆ యువకుడు ఆమెచేతిది ఓ గాజులాగి ఆమె

తమ్ముడికి వినబడేలాగున "ఏఁవండీ, ఏఁవండీ! క్షమించండి మీ గాజు మీరు తీసుకోండి! మరెప్పుడూ దొంగతనం చెయ్యనండి !" అంటాడు. ఆవిడ "కృతజ్ఞతాపూర్వక దృష్టుల్తో అతణ్ణి తడిపి ముంచెత్తుతుంది." అప్పుడు "దొంగవెధవా!" అంటూ ఆవిడ అన్నగారో, తమ్ముడుగారో కాని అతను ఆ యువకుణ్ణి పట్టుకొని "వీపు చీరేస్తాడు." అంతలో అసలైన ప్రేమయువతికూడా ఆ అల్లరి విని అక్కడికి వస్తుంది, యువకుడు యువతిని చూడకుండా దృష్టి తప్పించుకుంటాడు. విధవావిడ తన మేనకోడల్ని కౌగలించుకుని వెక్కి వెక్కి ఏడుస్తుంది. యువకుణ్ణి ఆవిడ తమ్ముడు చితక్కొట్టి విడిచిపెడతాడు, పోలీసువారికి అప్పజెప్పడు. (ఎందు చేతనంటే; ఇ. త, గారి జీవితంలోకి పోలీసులు అప్పటికి ఇంకారాలేదు.) ఆ రాత్రి ఆ దెబ్బలకి మూలుగుతాడే కాని ప్రేమ యువకుడు సంతృప్తిగా నిద్రపోతాడు.

ఆ కథలో ఆ విధంగా జరుగుతుంది.

పదహారోయేట అంత మంచికథ రాయగలిగినందుకు కథక కిశోరాలన్నీ ఇ. త. ని ఆకాశానికి ఎత్తేసేయి. "స్వర్గంలో సర్పం", "గులాబీకి ముల్లు",అని ఎవరైనా అనగలరు, కాని"మణికి ఫణి" అనడం చాలా కష్టం అన్నాయి కిశోరాలన్నీ కూడా. "అంతే కాదు అంత చిన్న వయసులో స్త్రీ బాధనీ, స్త్రీ హృదయాన్నీ అర్థంచేసుకొని అంత చక్కగా రాయగలగాలంటే దాని వెనుక ఎంతో స్వానుభవం ఉండి ఉండాలనికూడా కథక కిశోరాలన్నాయి. ఆ పొగడ్తకి యువక ఇ.త. ఎంతో ముద్దుగా సిగ్గు పడ్డాడు.

అదీ సంగతి! ఆ కథతో ఇంబట్సూర్ తమ్మయ్యా పెద్ద కథకుడయేడు. అతనికి చక్కని కీర్తి, పత్రికనించి వందరూపాయల చెక్కూ వచ్చేయి. చెక్కులేని కీర్తికంటే చెక్కుతో వచ్చిన కీర్తి ఎంతో ఆనంద

దాయకమని అతను దాన్తో తెలుసుకున్నాడు. అతను పెట్టిన పేరు "స్త్రీ, దుర్భరం నీ జీవితం!"

ఆ కథానికా రచయిత ఇంబిఙ్యార్ తమ్మయ్యా ఆ కథానికా రచనతో "రచ. ఇ. త"గా మారేడు, ప్రఖ్యాతి చెందేడు.

ఆ తరువాత ఓ చిన్న ప్రమాదం జరిగింది. అది రచ. ఇ. త.కి జరగలేదు. ఆకథ చదివేక అది అందరూ చదివి తననే చూస్తున్నారని తెలుసుకున్నాక యువ రచ. ఇ. తైన ఇ. త. గారి పక్కింటివారి విధవ మేనత్త ఊరవతల చెరువులో పడింది, "నిజం నిప్పులాంటి దయినప్పుడు ఆవిడ అలా చేస్తే మనవేం చేస్తాం?" అని ఇ త. గారి ముదురు స్నేహితు డొకాయన అన్నాడు. ఇ. త. కూడా ఆమెచావు గురించి ఇదేమాట అన్నాడు.

ఆంధ్రజ్యోతి-సచిత్రవారపత్రిక—ఆగస్టు-68.

కథా నిలయం
3802
శ్రీకాకుళం